# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 3 | సంచిక: 4 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 16 ఏప్రిల్ 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


## అధిష్టానం పరిధిలో మంత్రివర్గ విస్తరణ

పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదు
సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
హైదరాబాద్ వీడి గ్రామాలకు తరలి వెళ్లాల్సిందే
సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండండి
విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి
పార్టీ ఎమ్మెల్యేలకు సిఎం రేవంత్ సూచన



**హైదరాబాద్, ఏప్రిల్ 15 (ప్రభాత ఉదయం):** రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేస్తున్న వ్యాఖ్యలు దుమారం రేపుతున్న వేళ...ఎమ్మెల్యేలకు సిఎం రేవంత్ రెడ్డి సున్నితంగా హెచ్చరిక చేశారు. ఎవ్వరు కూడా లైన్ దాటి మాట్లాడవద్దని అన్నారు. మంత్రివర్గ విస్తరణ అన్నది అదిష్టానం నిర్ణయమని కూడా స్పష్టం చేశారు. శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో జరిగిన కాంగ్రెస్ శాసనభాపక్ష సమావేశంలో సిఎం రేవంత్ మాట్లాడారు. తనకు మంత్రి పదవి రాకుండా జానా రెడ్డి అడ్డుకుంటున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రచ్చ చేస్తే.. పదేళ్లు పార్టీని కాపాడుకున్న మమ్మల్ని కాదని.. వేరే పార్టీలు తిరిగొచ్చిన వారికి పదవులు ఇస్తారా అని ప్రేమ్‌సాగర్ రావు పరోక్షంగా ప్రభుత్వానికే వార్నింగ్ ఇచ్చారు. ఇలా ఒక్కొక్కరుగా కాంగ్రెస్ ఎమ్మెల్యే బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తుండటంపై సీఎం రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు హెచ్చరికలు చేశారు. మంత్రి పదవులను అధిష్ఠానం చూసుకుంటుందని తెలిపారు. పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యేలను హెచ్చరించారు. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ అని చెప్పారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానందే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. మంత్రివర్గ విస్తరణపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదని అన్నారు. మీరు మాట్లాడేదంతా రికార్డవుతుందని హెచ్చరించారు.అలాగే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ సోషల్‌మీడియా వాడటం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వంపై నెగిటివ్ ప్రచారం చేస్తుంటే.. ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పలువురు ఎమ్మెల్యేలు హైదరాబాద్‌కే పరిమితమవుతున్నారని అన్నారు. వీకెండ్ రాజకీయాలు చేయొద్దని సూచించారు.

రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభా పక్షం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. పలువురు ఎమ్మెల్యేలను హెచ్చరించినట్లు తెలుస్తోంది. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్. దీనిపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదని సీఎం తేల్చి చెప్పారు. మంత్రి

..మిగతా 2లో




## ట్రిలియన్ డాలర్ల ఎకానమీ దిశగా తెలంగాణ

ప్రభుత్వ ప్రైవేటు- భాగస్వామ్యంతో ఆర్థిక వ్యవస్థ పురోగతి
ఇతర నగరాలకన్నా హైదరాబాద్‌లో 56శాతం వృద్ధిరేటు
సిటిజన్ గ్లోబల్ కేపబిలిటీసెంటర్ ప్రారంభోత్సవంలో శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (ప్రభాత ఉదయం):** గ్లోబల్ బిజినెస్ హబ్‌గా హైదరాబాద్ మారిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇక్కడ కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ బాగా పెరిగిందని చెప్పారు. అమెరికాకు చెందిన సిటిజన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో సిటిజన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌ను మంత్రి ప్రారంభించిన సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడారు. దిల్లీ, చెన్నైలాంటి మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో 56 శాతం వృద్ధి రేటు ఉంది. ఈ క్రమంలో తెలంగాణ దేశంలో 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదిగేందుంకు చేస్తున్న ప్రయత్నానికి దోహదపడుతుందని మంత్రి అన్నారు. ప్రస్తుతం బలమైన ప్రభుత్వ ప్రైవేటు- భాగస్వామ్యంతో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ వేగంగా ముందుకు సాగుతోందని ఆయన వెల్లడించారు. గతేడాది రిటైల్ రంగంలో 1.8 మిలియన్ చదరపు అడుగుల స్పేస్‌ను సంస్థలు లీజుకు తీసుకున్నాయి. ఆమ్జెన్, గ్లోబల్ లాజిక్, ఎలీ లిల్లీ, మారియట్, సిగ్నాలాంటి అంతర్జాతీయ సంస్థలు నగరానికి వచ్చాయి. ఏడాది వ్యవధిలో 70కి పైగా గ్లోబల్ కేపబులిటీ సెంటర్‌లు ఏర్పాటయ్యాయి. 2030 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటా ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటు-ంది. పెట్టు-బడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వంపై నమ్మకంతో పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని శ్రీధర్‌బాబు

..మిగతా 2లో

## ఢిల్లీ కాలుష్యానికి చెక్ పెట్టాల్సిందే

ప్రత్యామ్నాయ ఇంధన వనరులు వాడాలి
కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (ప్రభాత ఉదయం):** దేశ రాజధానిలో వాతావరణ కాలుష్యం తీవ్రస్థాయిలో ఉండటంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తంచేశారు. ముఖ్యంగా శిలాజ ఇంధనాలు తగ్గించాలని, ఎలక్ట్రిక్ వాహనాల వైపు ప్రజలు మళ్లాలలని ఆయన సూచించారు. మంగళవారం నాడు ఆయన మాట్లాడుతూ...ఢిల్లీ కాలుష్యానికి చెక్ పెట్టేందుకు ప్రజలు కూడా బాధ్యతగా ముందుకు రావాలన్నారు. పెట్రోల్, డీజిల్ కాలుష్యానికి ప్రధాన కారణాలు కాబట్టి వాహనాల్లో ఉపయోగించే ఇంధనంలో మార్పు అవసరమన్నారు. మనం దాదాపు రూ.22 లక్షల కోట్ల విలువైన శిలాజ ఇంధనాలను దిగుమతి చేసుకుంటున్నామని.. వాటికి ప్రత్యామ్నాయ ఇంధనాలు వినియోగించా ల్సిన సమయం వచ్చిందన్నారు.

## ట్రంప్ దూకుడుకు చైనా కళ్లెం

కీలక ఖనిజాల ఎగుమతులు నిలిపివేత
టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ పరికరాలకు ముడిసుకు దెబ్బ



**వాషింగ్టన్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (ప్రభాత ఉదయం):** అమెరికా-చైనాల మధ్య సుంకాల యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో చైనా కూడా ట్రంప్ తీరుకు ఘాటుగా సమాధానం ఇస్తోంది. ఈక్రమంలో అమెరికాకు అవసరమైన పలు వస్తువులపై నిషేధం విధించి, ఎగుమతలను నిలిపివేసింది. చైనా ఉత్పత్తులపై టారిఫ్‌లను యూఎస్ 145 శాతానికి పెంచినట్లు ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకు ప్రతిగా చైనా కూడా అమెరికా ఉత్పత్తులపై సుంకాలను 125 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించింది. అంతటితో ఆగకుండా తమ దేశంలో లభ్యమయ్యే అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలను యూఎస్‌కు ఎగుమతి చేయడాన్ని ఆపేస్తున్నట్లు బీజింగ్ పేర్కొంది.

## నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ ఛార్జ్‌షీట్

ఛార్జ్‌షీట్‌లో సోనియా, రాహుల్ పేర్లు
ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కాంగ్రెస్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (ప్రభాత ఉదయం):** 'నేషనల్ హెరాల్డ్' మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటు-చేసుకుంది. ఈ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. ఇప్పటికే ఈ కేసుతో ముడిపడి ఉన్న ఆస్తుల స్వాధీనానికి నోటీసులు జారీ చేసిన ఈడీ అధికారులు.. తాజాగా కాంగ్రెస్ ఎంపీలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు ఆ పార్టీ నేతలు శామ్ పిట్రోడా, సుమన్ దుబే పేర్లతో దిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లయింట్ దాఖలు చేశారు.



## పోలవరంలో నేడు కేంద్రబృందం పర్యటన

డయాఫ్రమ్ వాల్ నాణ్యతను పరిశీలించనున్న నిపుణులు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (ప్రభాత ఉదయం):** నేటినుంచి పోలవరంలో కేంద్ర నిపుణుల బృందం పర్యటించనుంది. గ్యాప్-1, గ్యాప్-2 ప్రాంతాల్లో నిర్మిస్తున్న డయాఫ్రమ్ వాల్ పనుల నాణ్యత ఈ బృందం పరిశీలించనుంది. అల్లూరి జిల్లా దండంగి గ్రామం వద్ద స్పిల్‌వే సమీపంలో ఉంచిన మట్టి నిల్వల నుంచి శాంపిల్స్ సైతం సేకరించనున్నారు. ఈ బృందంలో కేంద్ర మెటీరియల్ అండ్ సాయిల్ రిసెర్చ్ సెంటర్ నిపుణులు బి.సిద్ధార్థ్ హెడావో, సైంటిస్టు, ఏఆర్వో విపుల్ కుమార్ గుప్తాలు ఉన్నారు. త్వరలోనే మరోసారి ప్రాజెక్టు ప్రాంతంలో విదేశీ నిపుణుల బృందం కూడ పర్యటనకు రానుంది.

## భూముల అమ్మకంలో బిఆర్ఎస్‌తో పోటీ

మీడియాతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి




**హైదరాబాద్, ఏప్రిల్ 15 (ప్రభాత ఉదయం):** తెలంగాణలో భూములు, మద్యం విక్రయాలు, అప్పులతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. భూముల అమ్మకంలో భారాసతో కాంగ్రెస్ పోటీ-పడుతోందన్నారు. హెచ్‌సీయూ అంశంలో తనపై కేసు పెడితే ఎదుర్కొనేందుకు సిద్ధమని తెలిపారు. అర్ధరాత్రి ఫ్లడ్ లైట్లు పెట్టి చెట్లను నరికిన ప్రభుత్వాలను చూశామా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. భాజపా రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు తొందరేమీ లేదని కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికకు మరో వారం రోజుల సమయం పట్టే అవకాశముందని తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడి ప్రతిపాదనల్లో తన పేరు లేదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తమిళనాడులో ఎన్డీఏను పునరుద్ధరించామని.. తెలంగాణలోనూ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్ తమ పార్టీ నేత అని.. ఆయన అంశంపై అంతర్గతంగా చర్చించుకుంటామని తెలిపారు.

మీడియాతో జరిగిన చిట్‌చాట్ సందర్భంగా పలు కీలక అంశాలపై స్పందించారు. తనను జాతీయ అధ్యక్షుడిగా నియమించనున్నట్టు వస్తున్న ప్రచారాలను ఖండిస్తూ.. ఇప్పటి వరకు దక్షిణాదిలో కేవలం రెండు రాష్ట్రాలకే అధ్యక్షుల నియామకం జరిగిందని, నన్ను జాతీయ అధ్యక్షుడిగా చేయాలన్న ప్రతిపాదన ఎక్కడా లేదని స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన అంశం ప్రస్తుతం పార్టీలో కానీ, కేంద్ర ప్రభుత్వంలో కానీ చర్చలో లేదని తెలిపారు.



## ఇందిరమ్మ ఇండ్ల ఇంటి నిర్మాణ పనులు వేగవంతంగా చేయాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 15(ప్రభాత ఉదయం)ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అన్నారు.మంగళవారం కేటిదొడ్డి మండలం ఉమిత్యాల గ్రామంలో, ధరూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల పనులను, నమూనా ఇండ్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గ్రామంలో ఇండ్ల నిర్మాణం పనులు ఎలా జరుగుతున్నాయని లబ్ధిదారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.లబ్ధిదారుల జాబితా పరిశీలించి, వారు వాస్తవంగా అర్హులేనా అనే విషయాన్ని ఖచ్చితంగా నిర్ధారించాలని ఎంపీడీఓను సూచించారు. అర్హతల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ యాప్ లో నమోదు చేస్తూ లబ్ధిదారులకు ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ధరూర్ మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లు నమూనా గృహాల నిర్మాణపు పనుల పురోగతిని గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల కోసం ఉపయోగిస్తున్న సామగ్రి పనుల నాణ్యత,నిర్మాణ విధానాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ మోడల్ గృహం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, ఎంపీడీఓ కృష్ణ మోహన్, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.




## ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో నేషనల్ వెబ్ నార్

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 15 (ప్రభాత ఉదయం)గద్వాలలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపల్ ఎ.మీనాక్షి అధ్యక్షతన నేషనర్ వెబ్ నార్ ఎలివేట్ యువర్ సెల్ఫ్ (మిమ్మల్ని మీరు వృద్ధిలోకి తెచ్చుకొండి) అనే అంశం పైన అనంతపురం డిగ్రీ కళాశాల జువాలజీ ప్రొఫెసర్ జిఎల్ఎన్ ప్రసాద్ ప్రసంగించారు. ఈ సందర్భంగా జిఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతు... విద్యార్థినులు తమను తాము ఉన్నతీకరించుకోవడం కోసం ఉన్నతమైన మనస్తత్వాలను కలిగి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకాని. తాము కోరుకున్న విజయాలవైపు పయనించాలని, దీనికోసం విద్యార్థినులు నిరంతరం కృషి చేయాలని తెలిసారు. ఈ సందర్భంగా కళశాల ప్రిన్సిపల్ మీనాక్షి మాట్లాడుతూ విద్యార్థినులు తమ విజయ సాధనలో తల్లిదండ్రులు, అధ్యాపకులతో పాటు స్నేహితులు కూడ ప్రముఖ పాత్ర వహిస్తారు కాబట్టి మంచి మిత్రులను ఎంచుకాని ఉన్నత ఆశయాలకై ప్రయత్నస్తూ తాము కోరుకున్న విజయాలను అందుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి పార్టీ మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సి.కి లక్ష్మీప్రసాద్ మరియు ఐక్యూఏసి కో ఆర్డినేటర్ ఎం. దేవుజా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందము, విద్యార్థినులు పాల్గోన్నారు.



## జిల్లా కేంద్రములో బీసీ బాలుర కళాశాల వసతి గృహం నూతన భవనం మంజూరు చేయాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 15 (ప్రభాత ఉదయం)భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావుకు సంక్షేమ వసతిగృహాల్లో నెలకొన్న సమస్యను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామేర కిరణ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఉన్న వెనుకబడిన తరగతుల బాలుర కళాశాల వసతి గృహం శిథిలావస్థకు చేరుకోవడంతో భవనం పైభాగం పెచ్చులు ఊడి విద్యార్థులపై పడుతున్న ఈ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. గత రెండు సంవత్సరాల నుండి ఇదే వసతి గృహంలో విద్యార్థులు తమ ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని విద్యను అవశిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు సంవత్సరాలు నుండి స్థానిక ప్రజాప్రతినిధులకు, జిల్లా కలెక్టర్లకు పలుమార్లు బీసీ కళాశాల వసతి గృహానికి నూతన భవనం నిర్మించాలని వినతి పత్రాలు ఇచ్చిన కాని అధికారులు ప్రజాప్రతినిధులు కనీసం స్పందించిన పరిస్థితి లేదని వారు వాపోయారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం బీసీ బాలుర కళాశాల వసతి గృహం కు పక్కా భవనం నిర్మించకపోతే గద్వాల జిల్లా కేంద్రం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బీసీ కళాశాల విద్యార్థులతో పాదయాత్ర నిర్వహిస్తామని ఈ ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలు ఎండగడతామని వారు హెచ్చరించారు. అదేవిధంగా జిల్లాలో సంక్షేమ వసతులు పర్మినెంట్ వార్డెన్స్ లేక పర్యవేక్షించే అధికారులు లేక ,వసతి గృహాల్లో వీధులు నిర్వహించే కామాటి కుక్కు, స్కావెంజర్, వాచ్ మెన్, ఏఎన్ఎం పోస్టులు భర్తీ చేయక తమ యొక్క రూమ్ లో క్లీన్ చేసుకోవాల్సిన పరిస్థితి వాష్రూమ్స్ తామే శుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితి అనారోగ్య సమస్యలు వస్తే వారే తమ మిత్రుల సహకారంతోటి ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న జిల్లా అధికారులు, జిల్లా సహాయ అధికారులు,వసతి గృహంలోని పోస్టులు భర్తీ చేయాలి అని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వీరేష్, నరసింహ ,పవన్, కళ్యాణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు..

# జలమండలి "మోటార్ ఫ్రీ టాప్" డ్రైవ్ ప్రారంభం

**అక్రమ మోటార్ వాడకాన్ని... నీటి వృథాను నియంత్రించేందుకు చర్యలు**

**నీటి సరఫరా సమయంలో మాదాపూర్ లో పర్యటించిన ఎండీ అశోక్ రెడ్డి**

**సరఫరాలో లో పెషర్ సమస్యను తగ్గించడానికి కసరత్తు**

**జలమండలి పరిధిలో అన్ని డివిజన్లలో డ్రైవ్ ప్రారంభం**

**మొదటి రోజే 64 ఇల్లీగల్ మోటార్లు స్వాధీనం.**

**84మందికి పెనాల్టీ విధింపు.**





హైదరాబాద్, ఏప్రిల్ 15(ప్రభాత ఉదయం) నగరంలో అక్రమ మోటార్ వాడకాన్ని అరికట్టడానికి.. నీటి వృథాను నివారించడానికి జలమండలి మోటార్ ఫ్రీ టాప్ డ్రైవ్‌ను ప్రారంభం అయింది. ప్రధానంగా లో ప్రెజర్ ఉన్న ప్రాంతాలు.. మోటార్ల వాడకం ఎక్కువగా ఉన్న కాలనీలలో ఈ డ్రైవ్‌లో బాగంగా ఎండీ అశోక్ రెడ్డి క్షేత్ర స్థాయిలో సిబ్బందితో కలిసి పాల్గొని కొన్ని ప్రాంతాల్లో మోటార్లు సీజ్ చేశారు.ఈ నేపథ్యంలో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి విజిలెన్స్, స్థానిక అధికారులతో కలిసి మాదాపూర్ లోని కాకతీయ హిల్స్ లో నీటి సరఫరా సమయంలో పర్యటించి తనిఖీలు నిర్వహించారు. కొంతమంది అపార్ట్మెంట్ వాసులతో ముచ్చటించిన ఎండీ దాదాపు 150 కిలో మీటర్ల నుంచి పెద్ద పంపులు, భారీ పైపుల ద్వారా నగర పౌరులకు జలమండలి నీటి సరఫరా చేస్తోందని.. వెయ్యి లీటర్లకు శుద్ధి చెయ్యడానికి రూ. 50 వరకు ఖర్చు చేసి తాగునీరు సరఫరా చేస్తున్నామని, అలాంటి నీటిని మొక్కలకు, ఫ్లోర్, వాహనాలను కడగడానికి వినియోగించకూడదని అన్నారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ... జలమండలి సుదూర ప్రాంతాల నుంచి నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తోందని, కాబట్టి.. నీటిని వృథా చేయకుండా వాటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని కోరారు. ఇప్పటికే నగరంలో భూగర్భ జలాలు అడుగంటిపోగా కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిందని అన్నారు. రానున్నరోజులలో నీటికి ఇబ్బంది అయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు తాగునీటికై సరఫరా చేసే శుద్ధమైన నీటిని గార్డెనింగ్, నిర్మాణం తదితర అవసారకు వృధా చేయకూడని విజ్ఞప్తి చేసారు. అలాగే నల్లలకు మోటార్లు బిగించి నీటిని తోడితే మిగితా వినియోగదారులకు లో ప్రెషర్ తో నీటి సరఫరా కావడంతో ఇబ్బంది పడుతున్నారని వివరించారు. అలాగే నీటి సరఫరా అవరాలకు సరిపోక ట్యాంకర్ బుక్ చేస్తున్నారని.. దీంతో ట్యాంకర్ డిమాండ్ పెరుగుతున్నట్లు చెప్పారు. అందుకే ఈ డ్రైవ్ చేపట్టినట్టు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ డ్రైవ్ జలమండలి పరిధిలోని అన్ని డివిజన్ ప్రాంతాల్లో నిర్వహిస్తామని.. ఈడీ డైరెక్టర్ నుంచి కిందిస్థాయి లైన్ మెన్ వరకు పాల్గొని అక్రమ మోటార్లు ను సీజ్ చేసి నీటి వృధా అరికట్టాలని సూచించారు. అంతకు ముందు ప్రాంతంలోని అపార్ట్మెంట్ వాసులు జలమండలి పైపులైనుకు నేరుగా విద్యుత్ మోటార్లు బిగించి నీటిని అక్రమంగా తోడుతున్న వినియోగదారులను గుర్తించి జలమండలి విజిలెన్స్ సిబ్బంది మోటార్లు సీజ్ చేసారు. మోటార్ ఫ్రీ టాప్ డ్రైవ్ లో మొదటి రోజు ఇప్పటివరకు అన్ని డివిజన్ లలో కలిపి మొత్తం 64 మోటార్లను సీజ్ చేయగా 84 మంది వినియోగదారులకు అక్రమంగా మోటార్లు ఉపయోగించినందుకు.. నీటి వృధా చేసినందుకు పెనాల్టీ విధించారు. అత్యధికంగా ఓ అండ్ ఎమ్ డివిజన్ లో 6 ఎస్ఆర్ నగర్ పరిధిలో 25 మోటార్లు సీజ్ చేసి పెనాల్టీ వేశారు.

### నల్లా మోటర్ బిగించడం చట్టరీత్యా నేరం..

మహా నగరానికి తాగు నీరు అందించేందుకు ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి సుదూర ప్రాంతాల నుంచి పైపు లైన్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తోంది. అందరికి నీరు సమపాళ్లలో పంపిణీ కావాలి.కానీ కొన్ని ప్రాంతాల్లో వినియోగదారులు తమ నల్లాలకు అక్రమంగా మోటార్లు అమర్చి నీటిని తోడుతున్నారు. ఇది చట్టరీత్యా నేరం. కొందరి వల్ల మిగిలిన వినియోగదారులకు లో ప్రెషర్‌తో నీటి సరఫరా జరుగుతోంది. ఎవరైనా వినియోగదారులు ఇలా తమ నల్లాలకు మోటార్లు బిగించి పట్టుబడితే.. వారిపై జలమండలి నిబంధనల ప్రకారం జరిమానా విధించడంతోపాటు మోటార్లు సీజ్ చేస్తారు. ఒకటికి రెండు సార్లు పట్టుబడితే కేసులు నమోదు చేస్తారు. వినియోగదారులెవరూ నల్లాకు మోటార్లు బిగంచకూడదు. ఒకవేళ తక్కువ ప్రెషర్‌తో నీరు సరఫరా అయినా.. లేదా నీటి సరఫరాలో ఏవైనా ఇతర సమస్యలు తలెత్తినా.. సంబంధిత మేనేజర్, డీజీఎం, జీఎం అధికారులను సంప్రదించాలి. లేదా జలమండలి కస్టమర్ కేర్ నంబర్ 155313కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.



## అధిష్టానం పరిధిలో మంత్రివర్గ విస్తరణ

మొదటి పేజీ తరువాయి...

పదవులపై ఒకరికి మించి మరొకరు లీకులు ఇస్తున్నారని అసహనం వ్యక్తం చేసిన సీఎం.. ఇష్టం వచ్చినట్లు- మాట్లాడితే మంత్రి పదవులు రావన్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు జాగ్రత్తగా పని చేసుకోవాలని సూచించారు. కాగా, మంత్రి వర్గ విస్తరణపై కొందరు ఆశావహులు బహిరంగంగానే తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. తనకు మంత్రి పదవి ఇవ్వకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఏకంగా హుకుం జారీ చేశారు. మరోవైపు.. మంత్రి పదవి విషయంలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఇలా మంత్రి వర్గ విస్తరణపై ఆశవహులు బహిరంగంగ మాట్లాతుండటంతోనే తాజాగా

జరిగిన సీఎల్పీ భేటీలో సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు దిశా నిర్దేశర చేశారు. ఎమ్మెల్యేలు ప్రతి గ్రామంలో పర్యటించేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. రేపటి నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు గ్రామాల్లో పర్యటించాలి. నేను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకమవుతా. ప్రతిపక్షాల ప్రచారాన్ని నమ్మి.. బుల్డోజర్లు పంపిస్తున్నారని ప్రధాని మాట్లాడుతున్నారు. భాజపా, భారాస కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయి. పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ఠ పెరిగితేనే భవిష్యత్ ఉంటుంది. మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలి. తెలంగాణ పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తెలంగాణ మోడల్‌పై దేశంలో చర్చ జరుగుతోంది. కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టాలనే భాజపా, భారాస ఒక్కటయ్యాయి. సన్నబియ్యం మన పథకం.. మన పేటెంట్, మన బ్రాండ్. భాజపా పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వట్లేదో చెప్పాలని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ సమావేశంలో మంత్రులు భట్టి విక్రమార్క,పొంగులేటి, శ్రీధర్ బాబు, పొన్నం, పిసిసి చీఫ్ మహేశ్కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## ట్రిలియన్ డాలర్ల ఎకానమీ దిశగా తెలంగాణ

మొదటి పేజీ తరువాయి...

అన్నారు. అమెరికాకు చెందిన ఫైనాన్షియల్ సేవల దిగ్గజం సిటిజన్ ఫైనాన్షియల్ గ్రూప్ తాజాగా హైదరాబాదులో టెక్ కంపెనీ కాగ్నిజెంట్ తో జతకట్టి తన గ్లోబల్ కెపాసిటీ సెంటర్ ఏర్పాటు చేసింది. ఇది హైదరాబాదులోని కాగ్నిజెంట్ క్యాంపస్ లోపలే ఉంటుందని కంపెనీ పేర్కొంది. వాస్తవానికి ఇదొక ఇన్నోవేషన్ హబ్ మాదిరిగా వర్క్ చేస్తుందని కంపెనీ వెల్లడించింది. ఈ జీసీసీ ఏర్పాటు- ద్వారా మార్చి 2026 నాటికి కొత్తగా 1000 హై వ్యాల్యూ కలిగిన ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని వెల్లడించాయి. ఈ సెంటర్ బ్యాంకింగ్ సంస్థలకు రానున్న కాలంలో థర్డ్ పార్టీ సంస్థలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని జీసీసీ పేర్కొంది. హైదరాబాద్‌లో దాదాపు 57,000 మంది సిబ్బందిని కలిగి ఉన్న కాగ్నిజెంట్, దాని ప్లాట్‌ఫారమ్‌లైన న్యూరో, ఎ÷-లోసోర్స్‌లను ఉపయోగించి సిటిజన్స్ జీసీసీకి అదనపు శక్తిని ఇవ్వనుంది. అలాగే క్లౌడ్, డేటా, సైబర్ సెక్యూరిటీ-, ఇంటెలిజెంట్ ఆటోమేషన్ రంగాల్లో భవిష్యత్తు అవసరాలకు తగిన ఉత్పత్తులను కంపెనీ అందించనుంది. అమెరికా చెందిన సిటిజన్స్ సంస్థ, కాగ్నిజెంట్ చేతులు కలపటంపై తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగంలో ఆవిష్కరణలకు ప్రపంచ ప్రధాన కార్యాలయంగా మారిందని కాగ్నిజెంట్ ప్రతినిధి నాగేశ్వర్ చెరుకుపల్లి అన్నారు. పైగా అనేక జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్ డెస్టినేషన్ గా మారింది. ప్రస్తుతం హైదరాబాదులో అత్యుత్తమ టాలెంట్ పూల్ అందుబాటులో ఉండటమే ప్రపంచ దేశాలకు చెందిన దిగ్గజ కంపెనీలను ఆకట్టుకోవటానికి కారణంగా నిపుణులు చెబుతున్నారు.



మల్లాపురం గ్రామంలో గిరిజన మహిళ ఇంట్లో సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి



ప్రజల నుండి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సంతోష్

## పేదల ఆకలి తీర్చేందుకు సన్న బియ్యం పంపిణి: కలెక్టర్ సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 15(ప్రభాత ఉదయం)పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సంపన్నులతో సమానంగా సన్న బియ్యాన్ని అందజేస్తోందని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ తెలిపారు. మంగళవారం కేటిదొడ్డి మండలం మల్లాపురం గ్రామంలో లబ్ధిదారుడు సురేష్ నాయక్ కుటుంబ సభ్యులతో గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ స్వయంగా సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లబ్ధిదారుడి కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సన్నబియ్యం ఎలా ఉన్నాయంటూ కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హత గల ప్రతి పేదవాడికి ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారాన్ని అందించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. తద్వారా రేషన్ కార్డుదారులకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా సన్న బియ్యం అందుతాయని అన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ... సన్న బియ్యం పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు నాణ్యమైన బియ్యం అందించాలన్నదే ప్రభుత్వ ఆశయమని పేర్కొన్నారు.పేద ప్రజలు ఆకలితో బాధపడకుండా పోషకాహారాన్ని పొందాలన్నదే ఈ పథక ప్రధాన ఉద్దేశమని అన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలన్నారు. సన్నబియ్యం లబ్ధిదారులు మాట్లాడుతూ... తమ ఇంటికి కలెక్టర్, అధికారులు భోజనానికి రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.సన్న బియ్యం పథకం ద్వారా రుచికరమైన భోజనం చేస్తున్నామని అధిక డబ్బులు వెచ్చించి బియ్యాన్ని బయట కొనుగోలు చేయకుండా ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని లబ్ధిదారుడు తెలిపారు. అనంతరం కలెక్టర్,శాసన సభ్యులు గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, గద్వాల్ మార్కెట్ యార్డు చైర్మన్ నల్ల హనుమంతు, తహసీల్దార్ హరికృష్ణ,అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ అందరివాడు:

**ప్రిన్సిపల్ చవ్వా వెంకట్ రెడ్డి**

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 15(ప్రభాత ఉదయం) భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందరివాడు అని, ఆయన ఆశయాలను యువత ఆదర్శం తీసుకొని ముందుకు సాగాలని ప్రిన్సిపల్ చవ్వా వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం గద్వాల జిల్లా కేంద్రంలో ఎన్ వై కే ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పిజి సెంటర్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు పాల్గొని భారత రాజ్యాంగం , డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర గురించి అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ ఉత్సాహంగా పాల్గొనడం జరిగింది. ఈ కాంపిటీషన్లో విజేతలు అయిన విద్యార్థులకు పుస్తకాలను బహుమతులుగా ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చవ్వా వెంకట్ రెడ్డి, ఎన్ వై కే ఎస్ ఇంచార్జ్ సతీష్ , భాస్కర్ , కళాశాల అధ్యాపక బృందం డాక్టర్ మంగళగిరి శ్రీనివాసులు, డా.గోపీనాథ్ రాథోడ్, వంగూరి గణేష్, నరేష్ రెడ్డి, నవీన్ గౌడ్, మహమ్మద్ రఫీ, రంగారెడ్డి, వేణుగోపాల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బియ్యం ఎగుమతి విధానంపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఒకరోజు సదస్సు

### ముఖ్య అతిథి గా హాజరైన పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

బుద్వేల్, ఏప్రిల్ 15(ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్రం నుంచి తొలిసారి ఫిలిప్పయన్స్ కు బియ్యం ఎగుమతి అవుతున్న నేపథ్యంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బియ్యం ఎగుమతి విధానం అన్న అంశంపై మంగళవారం ఒకరోజు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు కి తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథి గా హాజరు అయ్యారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే వరి ఉత్పత్తిలో ఈ ఏడాది తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని అన్నారు. ప్రస్తుత 2025-26 సంవత్సరంలో రాష్ట్రంలో సుమారుగా 280 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి అయిందని ఇది ఒక రికార్డు అని చెప్పారు. ఈ ఘనత కు రైతుల కృషి తో పాటు, అనుకూలమైన వాతావరణ పరిస్థితులు ప్రకృతి సహకారం మరియు నూతన వరి రకాలు అందుబాటులో ఉండటం కారణం అన్నారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రైతాంగాన్ని అభినందించారు. రైతాంగానికి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందనీ..సన్న రకాలకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ తో పాటు ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వివరించారు. రాష్ట్ర ప్రజల స్థానిక అవసరాలకు పోను, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్నబియ్యం పంపిణీ కోసం ఉద్దేశించిన బియ్యం పోను, కేంద్ర నిలువల కోసం సుమారు 60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయింపు లు పోగా ఇంకా సుమారు 50 నుంచి 60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం రాష్ట్రంలో మిగులు ఉంటుందని ఆయన అన్నారు. మిగులు ధాన్యం మార్కెట్ చేయడానికి అన్వేషన్లో భాగంగా ఆగ్నేయ ఆసియా ప్రాంతంలోని ఫిలిప్పైన్స్ కు తెలంగాణ బియ్యాన్ని ఎగుమతి చేయడాన్ని సదావకాశంగా తీసుకొని ఆ ప్రభుత్వంతో నేరుగా అవగాహన ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. ఈ ఒప్పందంలో భాగంగా ఏడాదికి




బియ్యం ఎగుమతులపై వ్యవసాయ విశ్వవిద్యాలయం లో జరిగిన ఒక రోజు సదస్సు లో పాల్గొన్న పౌర సరఫరా ల శాఖా మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి. చిత్రంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య

10 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యాన్ని ఎగుమతి చేసే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. దొడ్డు రకాలలో ముఖ్యమైన ఎం టీయు-1010, ఐ. ఆర్-64 రకాలను రాష్ట్రంలో విస్తృతంగా సాగు చేస్తున్నారని..వీటికి ఫిలిప్పీన్స్ లో అధిక డిమాండ్ ఉందని తెలిపారు. వరి సాగు లో ఇటీవల రైతాంగంలో ఆదరణ పొందుతున్న వరి నేరుగా విత్తే పద్ధతి(డీ ఎస్ ఆర్) రోజు విడిచి రోజు నీరు పెట్టే విధానం(ఏ డబ్ల్యు డీ), తక్కువ రసాయనాలు కలిగిన వరి రకాలను ఉత్పత్తి చేయడంపై రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు మంత్రి సూచించారు. అదేవిధంగా ఎగుమతికి అనుకూలమైన వరి రకాలను ఉత్పత్తి చేయడానికి రైతులకు తగిన ప్రోత్సాహకాలు, ఎగుమతి దారులకు విధానపరమైన ప్రోత్సాహకాలు ఇస్తామని ఆయన ప్రకటించారు. అధునాతన బియ్యం మిల్లులను ఒక డెమో రూపంలో ఆధునిక రైస్ మిల్లును వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసి రైతులకు, యువతకు శిక్షణ ఇచ్చి ఆధునిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య మాట్లాడుతూ ఫిలిప్పీన్స్ దేశం ఎప్పటికీ దిగుమతి చేసుకునే దేశమేనని.. ఎన్నటికీ స్వయం సమృద్ధి సాధించే దేశం కాదు కాబట్టి ఆ దేశాన్ని తెలంగాణ బియ్యానికి అనుకూలమైన మార్కెట్ గా గుర్తించి ఆ దిశగా చర్యలు తీసుకున్నట్లయితే తెలంగాణలో పండుతున్న బియ్యం నిల్వలకు శాశ్వత పరిష్కారం దొరికినట్లేనని చెప్పారు. అంతేకాకుండా, ప్రభుత్వం వరి ధాన్యం సేకరణ కేంద్రాల నుంచి బియ్యం ఔత్సాహిక ఎగుమతి దారులకు సరఫరా చేసినట్లయితే ప్రభుత్వానికి అయ్యే ఖర్చుకు సమానంగా ఔత్సాహికదారులకు ఇచ్చినట్లయితే ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండానే ఎగుమతులను ప్రోత్సహించే అవకాశం ఉంటుందని మంత్రి కి సూచించారు. అఖిలభారత రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బి కృష్ణారావు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు, అపెడా అధికారులు, రైతు నాయకులు, విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ బలరాం, వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ దామోదర్ రాజు, వరల్డ్ ఫుడ్ ప్రైజ్ ఫౌండేషన్ అవార్డు గ్రహీత మరియు ఇటీవల విశ్వవిద్యాలయం నియమించిన యు జి సి ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ డాక్టర్ సమరేందు మహంతి ఎగుమతుల విధానం అనే అంశంపై కీలక ఉపన్యాసం చేశారు.



బీజేపీ నాయకులతో సమావేశమైన ఎన్ ఐ ఆర్ డీ పీ ఆర్ ఉద్యోగులు

## తమ సమస్యలను పరిష్కరించండి

బుద్వేల్, ఏప్రిల్15(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయ తీరాజ్ సంస్థ (ఎన్ఐఆర్డీపీఆర్) ఉద్యోగులు మంగళవారం రాజేంద్రనగర్ బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా నాయకులు బొక్క నర్సింహ్మరెడ్డి, వై.శ్రీదర్, జోగి రవి లతో సమావేశమైనారు. ఇటీవల బొక్క నర్సింహ్మరెడ్డి ఆధ్వర్యంలో ఎన్ ఐ ఆర్ డీ పీఆర్ ప్రతినిధుల బృందం కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ని కలిసి తమ సంస్థను ప్రైవేటు చేయకుండ ఆపాలని, కేంద్రం ప్రతి సంవత్సరం ఇచ్చే మాదిరిగా బడ్జెట్ లో కేటాంపులు ఇవ్వాలని కోరారు. ఇదే విషయమై కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఒక సారి ఎన్ఐఆర్డీపీర్ కు వస్తానని చెప్పారు. ఈ నేపధ్యంలో మంగళవారం ఎన్ఆర్డీపీఆర్ ఉద్యోగులు బీజేపీ నాయకులను కలిసి తమ బాధలను మరొక సారి చెప్పుకున్నారు. త్వరగా కేంద్రమంత్రి జి కిషన్ రెడ్డిని తమ సంస్థకు తీసుకువచ్చి తమకు న్యాయం చేయాలని కోరారు.




దళిత రత్న అవార్డులు పొందిన పత్యార నరసింహ, పంబాల రాజు లను సన్మానిస్తున్న నాయకులు

## సత్యార నర్సింహ్మా, పంబాల రాజులకు దళిత రత్న అవార్డులు

బుద్వేల్ ఏప్రిల్15(బుద్వేల్):రాజేంద్రనగర్‌కు చెందిన దళిత నాయకులు పత్యార నర్సింహ్మా, పంబాల రాజుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా దళిత రత్న ఆవార్డులను ఇచ్చి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దళితుల సమస్యల పరిష్కారంలో తాము చూపుతున్న చొరవ ను గుర్తిం చి తమకు దళిత రత్న అవార్డులు ఇవ్వడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో మరింత బాధ్యతగా దళితుల సమస్యల పరిష్కారం కోసం నిస్వార్థంగా సేవలు అందిస్తామన్నారు. దళిత రత్న అవార్డులు పొందిన ప్రత్యార నర్సింహ్మా, పంబాల రాజు లను రాజేంద్రనగర్ కు చెందిన దళిత నాయకులు గొడుగు సంజీవ, ఎర్రుల శివకుమార్, పత్యార రాజు, పచ్చ నర్సింగ్ రావు, మం త్రి చంద్రశేఖర్, నవీన్, తదితరులు అభినందించారు.



టోల్ ప్లాజా సిబ్బంది పై దాడి చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగి

## టోల్ సిబ్బందిపై ప్రభుత్వ ఉద్యోగి దాడి, కేసు నమోదు

బుద్వేల్, ఏప్రిల్15 (ప్రభాత ఉదయం): ఔటర్ రింగ్ రోడ్డు పై హిమాయత్ సాగర్ టోల్ ప్లాజా వద్ద సిబ్బందితో గొడవ పడ్డ ఓ ప్రభుత్వ ఉద్యోగిపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి.... తెలంగాణ రాష్ట్ర సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ లో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న బహదూర్ పుర తాడ్బన్ ఈద్గా సమీపంలో నివాసం ఉండే ఏతేషామ్ హుస్సేన్ సిద్ధిఖీ మంగళవారం తన ఏపీ22 ఏఎం 2277 నెంబర్ కారులో ఔటర్ రింగ్ రోడ్డులో ప్రయాణం చేసి హిమాయత్ సాగర్ టోల్ ప్లాజ 17 ఎగ్జిట్ వద్ద కు వచ్చాడు. టోల్ ప్లాజా సిబ్బంది డబ్బుల కోసం అడగగా, తాను ప్రభుత్వ ఉద్యోగినని, తనకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. అందుకు టోల్ ప్లాజా వద్ద ఉన్న సిబ్బంది ఒప్పుకోక కారును ముందుకు వెళ్లనీయకుండ అడ్డుగా స్టాపర్ ను పెట్టి అడ్డు నిలిచున్నాడు. దీంతో అగ్రహించిన ఎతేషామ్ హుస్సేన్ సిద్ధిఖీ కారు దిగి టోల్ ప్లాజా సిబ్బందిపై దాడికి దిగాడు. అతని తో పాటు కారులో ఉన్న కుటుంబ సభ్యులు కూడా టోల్ ప్లాజా సిబ్బందిపై దాడి చేశారు. దీంతో టోల్ ప్లాజా సిబ్బంది రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఏతేషామ్ హుస్సేన్ సిద్ధిఖీ పై, అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ చెన్నూర్‌కు రాక

### మంగనపల్లి గ్రామంలో పెత్తందారుల దౌర్జన్యాలకు బలైన

### నాయిని కన్నయ్య కుటుంబాన్ని పరమర్శ

చెన్నూర్, ఏప్రిల్ 15. (ప్రభాత ఉదయం) :17వ తేది సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్స్ జాన్ వెస్లీ చెన్నూరు మండలాల్లో పర్యటించనున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. మంగళవారం చెన్నూర్ రాజన్న కాలనీలో జరిగిన సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ... వేమనపల్లి, కోటపల్లి, చెన్నూర్ మండలాల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకుంటారన్నారు. వేమనపల్లి మండలంలో ఇటీవల భూస్వామి, పెత్తందారుల ఆగడాలకు బలైపోయిన ఆదివాసి నాయని కన్నయ్య కుటుంబాన్ని పరామర్శిస్తారన్నారు. పేదలపై పెత్తందారుల ఆగడాలు కొనసాగడం మూలంగా ఆదివాసీలు, దళితులు, పేదలు తీవ్రమైన అన్యాయాలకు బలైపోతున్నారు. పేదలకు ధైర్యం నింపేందుకు ఈ మండలాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లూరి దేవదాస్ సిపిఎం పార్టీ బెల్లంపల్లి ఏరియా కమిటీ సభ్యులుబోడెంకి చందు , జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఉ మారాణి , సిపిఎం నాయకులు కరీం భీ, సిడం సమ్మక్క, బోగే నాగజ్యోతి, బుధక్కా, తుమ్మ రేణుక, బోయిరె రమాదేవి, బండారి రాజేశ్వరి, వెంకట స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 27న వరంగల్లో జరగనున్న బిఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలి: పి కార్తీక్ రెడ్డి



పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం బి ఆర్ ఎస్ ఇంచార్జ్ పి కార్తీక్ రెడ్డి

రాజేంద్రనగర్, ఏప్రిల్ 15(ప్రభాత ఉదయం) భారత్ రాష్ట్ర సమితి ఈనెల 27న తలపెట్టిన వరంగల్ భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం బి ఆర్ ఎస్ ఇంచార్జ్ పి కార్తీక్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ లో గల మైలార్ దేవుపల్లి డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ సగృహంలో జరిగిన డివిజన్ పార్టీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షుడు మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీ కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీ సమావేశానికి మంచి స్పందన లభించిందన్నారు. బిఆర్ఎస్ పార్టీ అభిమానులకు ప్రజలకు కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ముఖ్య నాయకులకు సూచనలు సలహాలు ఇచ్చారు. రాజేంద్రనగర్ సర్కిల్ నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు నాయకులు అందరూ కే సీ ఆర్ ప్రసంగాన్ని అందరూ వీక్షించి ఆయన చేసిన ప్రసంగాన్ని ప్రతి ఒక్కరూ ప్రజలకు వివరించాలని కోరారు. రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వం కాబట్టి మన కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేసిన నాయకులను అధికారులను మన ప్రభుత్వం వచ్చిన తర్వాత వదిలిపెట్టే ప్రసక్తి లేదని కార్యకర్తలకు మనోధైర్యాన్ని కల్పించారు. బహిరంగ సభకు జాగ్రత్తగా వెళ్లి తిరిగి ఇంటికి క్షేమంగా చేరుకోవాలని మైలార్ దేవ్ పల్లి డివిజన్ నాయకులకు సూచించారు. చివరిగా ముక్త కంఠంతో నాయకులందరూ ఎలక్షన్ ఎప్పుడు వచ్చినా రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా కార్తీక్ రెడ్డి ని గెలిపియడమే మా లక్ష్యం అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మైలార్ దేవ్ పల్లి డివిజన్ బి ఆర్ ఎస్ నాయకులు డి రమేష్ ముదిరాజ్ ,లక్ష్మీరాజ్ , బండ రాజేష్ యాదవ్, సోమ శ్రీనివాస్ గుప్తా, మైసిరెడ్డి, అరుణ్ ముదిరాజ్, శ్రీను, అప్ప రాజు, సురేష్ ,ఎల్ రాజు ,సరిత ,మహేష్ ,ఆర్ కుమార్, బాల్ రాజ్, బి వెంకటేష్ ,దుర్గాప్రసాద్ వెంకటరమణ ,అశోక్ కుమార్ ,సోమ సందీప్, సునీల్, కిషోర్ ,భూదేవి, అరుణ రెడ్డి ,పుష్పమ్మ, మమత, అనిల్ ,బొంబాయి రవి ,సింహాద్రి, రిషి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలి

### చల్లా నరసింహారెడ్డి

బుద్వేల్, ఏప్రిల్ 15(ప్రభాత ఉదయం) : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నరసింహ రెడ్డి పిలుపునిచ్చారు. యువజన కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొండకళ్ళ నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సాతం రాయి లో ఏర్పాటు చేసిన యువజన రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి బూతులో యువజన కాంగ్రెస్ కమిటీలు వేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ జక్కిడి శివ చరణ్ రెడ్డి , రాష్ట్ర ఇంచార్జ్ సురభి దివేది , ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు . యువజన కాంగ్రెస్ బూతు స్థాయి వరకు కమిటీలు వేయాలని అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ పథకాలను ప్రతి ఒక్కరికి లబ్ధిదారులకి చేరేలా చూడాలన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల్లోనే ఉంటూ పనిచేయాలని సభాముఖంగా తెలియజేశారు .ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా యువజన




యువజన కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశం లో మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నరసింహ రెడ్డి. చిత్రంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొండకళ్ళ నాగేందర్ రెడ్డి

కాంగ్రెస్ ఇంచార్జ్ లు రామచంద్ర రెడ్డి , అరవింద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు అందేమోహన్, శ్యాంసుందర్ రెడ్డి, హిందూజా రెడ్డి, కృష్ణం రాజు, కొత్త కురుమ యశ్వంత్ , నాగార్జున, జిల్లా ఉపాధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు కార్యదర్శిలు అసెంబ్లీ అధ్యక్షులు మండల అధ్యక్షులు పాల్గొన్నారు





నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నాయకులు

## నేతాజీ సుబాష్ చంద్రబోస్ విగ్రహం చుట్టూరా మార్బుల్స్‌తో అలంకరణ

బుద్వేల్, ఏప్రిల్15(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ హైదర్గూడ చౌరస్తాలో 1973 లో ఏర్పాటు చేసిన నేతాజీ సుబాష్ చంద్రబోస్ విగ్రహం చుట్టురా స్థానిక నాయకులు మార్బుల్స్ తో అలంకరించారు. నేతాజీ విగ్రహానికి రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ చెన్నై ప్రాంతానికి చెందిన అఖిల భారత సహ సం యోజక్ ఏలే శ్యామ్ కుమార్ జీ హాజరై ప్రసంగించారు. నేతాజీ పోరాట పటిమ గురించి చాటి చె ప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మ్యాడం రామేశ్వర్ రావు, ఎన్.మల్లారెడ్డి, ప్రణవభక్త సమాజం అధ్యక్షుడు మోండ్ర నర్సింహ్మా, ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్, తో పాటు పెద్ద ఎత్తున స్థానిక నాయకులు పాల్గొన్నారు.




## అంబేద్కర్ అందరికీ ఆదర్శప్రాయుడు

### అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం

### టీఎన్జీఎస్ జనరల్ సెక్రటరీ ఎస్ఎం హుస్సేనీ ముజీబ్

రాజేంద్రనగర్, ఏప్రిల్ 15(ప్రభాత ఉదయం) స్వేచ్ఛ, సమానత్వం, బలహీన వర్గాల అభ్యున్నతికి అలుపెరగని పోరాటం చేసిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని టీఎన్జీఎస్ జనరల్ సెక్రటరీ ఎస్ఎం హుస్సేనీ ముజీబ్ అన్నారు.భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతిని తెలంగాణ ఫోర్త్ క్లాస్ ఉద్యోగుల సెంట్రల్ అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ముజీబ్ అంబేద్కర్ చిత్రపటానికి ఉద్యోగుల తో కలిసి పూలమాలలు వేసి శ్రద్ధాంజలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...సమాజంలో అంటరానితనం, బానిసత్వం, అస్పృశ్యతల నిర్మూలనకు, వివక్ష పై అలుపెరుగని పోరాటం చేసి, అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించిన ఘనత అంబేద్కర్‌కే దక్కుతుందని అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాతగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ స్థాయిలో చాటడంలో చేసిన సేవలు చిరస్మరణీయమైనవని పేర్కొన్నారు. అందరూ సమానంగా, ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు, రిజర్వేషన్లు, అన్ని వెనుకబడిన వర్గాలకు సమానత్వం రావడానికి ముఖ్య కారణం అంబేద్కర్ పోరాటమే అన్నారు. ఈ కార్యక్రమంలో ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు యునావత్ దాస్య, ప్రధాన కార్యదర్శి కాదర్ బీన్ హసన్, సహాయ కార్యదర్శి గద్దల విజయకుమార్, కోశాధికారి ధనరాజ్, రాజేంద్రనగర్ అధ్యక్షుడు లక్ష్మణరావు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్‌లో ప్లాస్టిక్ బియ్యం సరఫరా అనే ప్రచారం అవాస్తవం

### జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

### కాశి విశ్వనాథ్

### అసత్య ప్రచారాలు చేసే వారిపై క్రిమినల్ కేసుల నమోదు

వనపర్తి ఏప్రిల్ 15 (ప్రభాత ఉదయం) రేషన్ షాపుల్లో పంపిణీ చేసే సన్న బియ్యం లో ప్లాస్టిక్ బియ్యం ఉన్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కాశి విశ్వనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలో ప్రజలను ఆందోళనకు గురిచేసి సమాజంలో అశాంతి సృష్టించాలనే దురుద్దేశంతో కొంతమంది సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని జిల్లా పౌర సరఫరాల అధికారి కాశి విశ్వనాథ్ ఖండించారు. గోదావరిఖని పెద్దపల్లి జిల్లా లోని తిలక్ నగర్ లో పంపిణీ చేసే సన్న బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం కలిసాయని ఫేస్ బుక్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాలలో కొన్ని వీడియోలు ప్రచారం చేశారని, దీని పై స్పందించి జిల్లా పౌర సరఫరాల శాఖ స్పందించి తిలక్ నగర్ ప్రాంతంలోని ఎక్కడ ఎటువంటి ప్లాస్టిక్ బియ్యం సరఫరా లేదని తప్పుడు ప్రచారం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రజలను భయాందోళనలకు గురి చేస్తూ సమాజంలో అశాంతిని సృష్టించాలనే దురుద్దేశంతో తప్పుడు వీడియోలను సామాజిక మాద్యాలలో ప్రచారం చేసినయెడల సంబంధిత అకౌంట్ హోల్డర్ల పై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.సన్న బియ్యం పథకంపై ప్రజలలో ఆందోళన సృష్టించేలా తప్పుడు ప్రచారాలు చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల అధికారి కాశి విశ్వనాథ్ హెచ్చరించారు.

## మే 9కి కూడా

# హరిహర వీరమల్లు రానట్టేనా



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఇటు సినిమాలు అటు రాజకీయాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఏపీ డిప్యూటీ సీఎంగా పదవి చేపట్టిన తర్వాత నిత్యం కీలక సమీక్షలు, సమావేశాలు, ఆ తర్వాత జిల్లాల పర్యటనలు, ప్రజలతో మమేకం ఇలా క్షణం తీరిక లేకుండా బిజీ అయ్యారు. కమిటైన సినిమాలు పూర్తి చేయాలన్నా కూడా పవన్ కళ్యాణ్‌కి తీరిక దొరకడం లేదు. పవన్ బిజీ వల్ల ఇదివరకే ఒప్పందం చేసుకొని చేస్తున్న సినిమాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఓజీ సంగతేమో కాని పవన్ కళ్యాణ్ నటిస్తున్న హరిహర వీరమల్లు సినిమాపై మాత్రం సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. హరిహర వీరమల్లు సినిమా మే9 న రిలీజ్ పక్కా అంటూ నిర్మాతలు పోస్టర్స్ వేస్తునే ఉన్నారు. ఇటీవల డబ్బింగ్ కూడా స్టార్ట్ అయిందని క్లారిటీ ఇచ్చారు. పవన్ కళ్యాణ్ ఓ వారం రోజులు డేట్స్ ఇస్తే చిత్ర షూటింగ్ పూర్తి అయిపోతుంది. కాని పవన్ కళ్యాణ్ మాత్రం బిజీ షెడ్యూల్స్ వలన డేట్స్ ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. మరి పవన్ సన్నివేశాలు లేకుండా సినిమాని విడుదల చేయాలన్నా కూడా, ఆ సీన్స్ మూవీకి అత్యంత కీలకమైన సన్నివేశాలు. ఎట్టి పరిస్థితులలో వాటితోనే సినిమాని విడుదల చేయాలని మేకర్స్ అనుకుంటున్నారట. గత వారమే షూటింగ్ పూర్తి కావలసి ఉన్నా కూడా ఆయన చిన్న కుమారుడు మార్క్ శంకర్ కి సింగపూర్ లో అగ్నిప్రమాదం జరగడం తో హుటాహుటిన అక్కడికి బయలుదేరాడు. రీసెంట్‌గా తిరిగి హైదరాబాద్‌కి వచ్చాడు పవన్. ఇక వెంటనే షూటింగ్స్‌లో పాల్గొంటాడని అభిమానులు భావిస్తున్నారు. అయితే ప్రస్తుతం పవన్ కళ్యాణ్ సినిమా షూటింగ్ చేసే మూడ్‌లో లేదని మరో వారం రోజులు ఆగమన్నాడని టాక్ వినిపిస్తుంది. దీంతో నిర్మాత ఏఎం రత్నం దిక్కుతోచని స్థితిలో ఉన్నారట. మే నెలలో చిత్రాన్ని విడుదల చేయకపోతే అమెజాన్ ప్రైమ్ సంస్థ కాంట్రాక్టు రద్దు చేసుకుంటామని సీరియస్ వార్నింగ్ కూడా ఇచ్చింది. పవన్ కళ్యాణ్ డేట్స్ ఇస్తే మే 9న చిత్రాన్ని రిలీజ్ చేయవచ్చు. లేదంటే నిర్మాత అనేక సమస్యలు ఎదుర్కోక తప్పదు. ఈ చిత్రం ఇప్పటికే 300 కోట్ల రూపాయల బడ్జెట్ దాటేసింది. మరి అంత బడ్జెట్ నిర్మాతకి వస్తుందా లేదా అనేది చూడాలి.



## చిరంజీవి విశ్వంభర

# ఫస్ట్ సింగిల్‌కు సూపర్ క్రేజ్

### టాప్ 1 ప్లేస్‌లో రమ రామ సాంగ్ ట్రెండింగ్

టాలీవుడ్ స్టార్ యాక్టర్ చిరంజీవి కాంపౌండ్ నుంచి వస్తోన్న సోషియో ఫాంటసీ ప్రాజెక్ట్ విశ్వంభర. బింబిసార ఫేం వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో త్రిష ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్, రమ్య పసుపులేటి, సురభి, ఈషా చావ్లా, ఆశ్రిత వేముగంటి నందూరి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.
కాగా ఇటీవలే ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ రమ రామను విడుదల చేశారని తెలిసిందే. ఈ పాటకు మ్యూజిక్ లవర్స్ నుంచి మంచి స్పందన వస్తోంది. ఈ పాట యూట్యూబ్‌లో నంబర్ 1 ప్లేస్‌లో ట్రెండింగ్ అవుతోంది. సరస్వతి పుత్ర రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను ఎంఎం కీరవాణి కంపోజ్ చేయగా.. శంకర్ మహదేవన్, ఐరా ఉడుపి, లిప్సికా భాష్యం పాడారు. రమ రామ సాంగ్ విశ్వంభరకు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని తాజా వార్త చెప్పకనే చెబుతోంది.
ఈ మూవీని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తుండగా.. ఇప్పటికే రిలీజ్ చేసిన విశ్వంభర టైటిల్ లుక్, కాన్సెప్ట్ వీడియో మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ చిత్రాన్ని మే 9న విడుదల చేయనుండగా.. మేకర్స్ నుంచి స్పష్టత రావాల్సి ఉంది

### అజిత్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' మేకర్స్‌కు లీగల్ నోటీసులు పంపిన

# మ్యూజిక్ మాస్ట్రో

### రూ.5 కోట్లు డిమాండ్



తమిళ హీరో అజిత్ నటించిన తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. దర్శకుడు అధిక్ రవిచంద్రన్ తెరకెక్కించిన ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదలైన విషయం తెలిసిందే. ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ రూపొందిన ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా తాజాగా షాక్ ఇచ్చారు. మేకర్స్‌కు లీగల్ నోటీసులు పంపారు. ఈ సినిమాలో గతంలో తాను స్వరపరిచిన మూడు పాటలను అనుమతి లేకుండా ఉపయోగించుకున్నారని నోటీసుల్లో పేర్కొన్నారు.

'నాట్టుపుర పట్టు' అనే తమిళ చిత్రం నుంచి 'ఓథ రుబాయుమ్ తేరెన్', 'సకలకళా వల్లవన్' అనే తమిళ చిత్రం నుంచి 'ఇలమై ఇధో ఇధో' పాట, 'విక్రమ్' చిత్రంలోని 'ఎన్ జోడి మంజ కురువి' పాటలను తన అనుమతి లేకుండా రీ క్రియేట్ చేసి అజిత్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రంలో వాడారని తెలిపారు. అందుకుగానూ రూ.5 కోట్లు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాదు సినిమాలో ఆ సాంగ్స్‌ను వెంటనే తొలగించి క్షమాపణలు చెప్పాలని కోరారు. మరోవైపు 'గుడ్ బ్యాడ్ అగ్లీ'లో త్రిష ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించింది. యోగిబాబు, రాహుల్ దేవ్, అర్జున్ దాస్, సునీల్, ప్రభు ఇతక కీలక పాత్రల్లో నటించారు.



### 'క్రిష్ 4'.. రూ.30 కోట్లు డిమాండ్ చేస్తున్న

# బాలీవుడ్ బ్యూటీ

బాలీవుడ్ స్టార్ నటుడు హృతిక్ రోషన్ మెగాఫోన్ పడుతున్న విషయం తెలిసిందే. తాను హీరోగా వచ్చిన బ్లాక్ బస్టర్ క్రిష్ ఫ్రాంచైజీలో భాగంగా నాలుగో పార్ట్‌కు హృతిక్ రోషన్ దర్శకత్వం వహించబోతున్నాడు. 20 ఏళ్ల క్రితం 'కోయీ మిల్ గయా'తో మొదలైన ఈ సిరీస్, ఆ తర్వాత 'క్రిష్ 2', 'క్రిష్ 3'లతో బ్లాక్ బస్టర్‌లు అందుకుంది. ఈ సినిమాల్లో హృతిక్‌తో పాటు అందాల తార ప్రియాంక చోప్రా ఫీమేల్ లీడ్‌గా నటించగా, కంగనా రనౌత్, వివేక్ ఒబెరాయ్ వంటి స్టార్స్ కీలక పాత్రల్లో కనిపించారు. అయితే తాజాగా రాబోతున్న 'క్రిష్ 4'లో ప్రియాంక చోప్రా మరోసారి లీడ్ రోల్‌లో కనిపించబోతున్నారని తెలుస్తుంది. హృతిక్ రోషన్ ఈ మూవీ కథను ప్రియాంకకు వినిపించగా.. ఆమెను ఆకట్టుకున్నట్లు తెలుస్తోంది. ప్రియా పాత్రలో ఆమె మెరవనున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే, ఈ విషయంపై ప్రియాంక చోప్రా టీమ్ నుంచి ఇప్పటివరకూ అధికారిక ప్రకటన రాలేదు. ఇదిలావుంటే ఈ ప్రాజెక్ట్ కోసం ప్రియాంక చోప్రా భారీ మొత్తంలో డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తుంది. క్రిష్ 4కి ఏకంగా రూ.20 నుంచి 30 కోట్లు రెమ్యూనరేషన్ డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉంటే, సూపర్‌స్టార్ మహేష్ బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమాకు కూడా ప్రియాంక దాదాపు రూ.30 కోట్ల వరకు పారితోషికం తీసుకోనున్నట్లు సమాచారం.

## శంబాల

# మేకింగ్ వీడియో రిలీజ్

### ఆసక్తి పెంచుతున్న విజువల్స్



యంగ్ హీరో ఆది సాయి కుమార్ కెరీర్ డిఫరెంట్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ అవుతోంది. ప్రతి సినిమాలో వైవిధ్యం చూపిస్తూ దూసుకుపోతున్న ఈ హీరో ప్రస్తుతం ఆడియెన్స్‌ను నూతన ప్రపంచంలోకి తీసుకెళ్లే సినిమా చేస్తున్నారు. ఆ సినిమానే శంబాలా. కాల్పనిక ప్రపంచంలో జరిగే అద్భుతమైన ఘట్టాల్ని చూసి ఆడియెన్స్ థ్రిల్ అవుతున్నారు. ఈ క్రమంలోనే ఆధ్యాత్మిక ప్రపంచంలోకి తీసుకెళ్లేలా 'శంబాల' చిత్రాన్ని పూర్తి చేస్తున్నారు ఆది సాయి కుమార్. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ పై రాజశేఖర్ అన్నభీమోజు, మహిధర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమాకు 'ఏ-యాడ్ ఇన్‌ఫినిటిమ్' ఫేమ్ డైరెక్టర్ యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్నారు. ఖర్చులకు ఎక్కడా రాజీ పడకుండా భారీ ఎత్తున ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ఆది సాయి కుమార్ సరసన అర్చన అయ్యర్ కథానాయికగా నటిస్తోంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుతున్న దర్శకనిర్మాతలు.. ఓ వైపు షూటింగ్ చేస్తూనే మరోవైపు జోరుగా ప్రమోషన్స్ చేస్తున్నారు. ఇప్పటికే శంబాల మూవీ నుంచి విడుదలైన ఫస్ట్ లుక్ మొదలుకొని.. వరుసగా వస్తున్న అన్ని అప్‌డేట్స్ సినిమాపై అంచనాలు క్రియేట్ చేశాయి. ఈ క్రమంలోనే తాజాగా శంబాలా మేకింగ్ వీడియో వదిలారు మేకర్స్. టీజర్ లోడింగ్ అంటూ వదిలిన ఈ వీడియోలో సినిమా కోసం చిత్రయూనిట్ ఏ రేంజ్ లో కష్టపడుతోందో చూపిస్తూ ఆసక్తిరేకెత్తించారు. తాజాగా విడుదల చేసిన ఈ వీడియో సినిమాపై ఉన్న అంచనాలకు రెక్కలు కట్టింది. చిత్రంలో భారీ యాక్షన్ ఎపిసోడ్స్ చూడబోతున్నామని ఈ వీడియో చెప్పకనే చెప్పింది.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY.** **"RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608